క్లుప్తంగా

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పూజలు జరిపిస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి ప్రాతః కాలార్చన, బాల భోగం నిర్వహించిన తరువాత ఆంజనేయస్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం స్వామిని నూతన వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణాలు చేపట్టి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, రామగోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నెల్లిమర్ల: గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామాల్లో రక్షిత మంచి నీరు అందించాలన్నారు. గ్రామాల్లో నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కాలువల్లో మురుగునీరు ఉండకుండా పారిశుద్ధ్య పనులు జరిపించి, చెత్త వేయకుండా చూడాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ జి.శంకరజగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎంపీపీ కల్యాణి తదితరులు

పూసపాటిరేగ : విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు ఇస్తాయని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, కార్యదర్శులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో నిబద్ధత, నిజాయితీతో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు సేవలు అందించారని కొనియాడారు. ఎటువంటి సమస్యలు వున్నా పరిష్కరించే దిశగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, జలపార శివతో పాటు వివిధ శాఖలు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్యారవీ షరీఫ్ ఉత్సవాలు ప్రారంభం



అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ నిర్వాహకులు

విజయనగరం టౌన్: సున్నీ ముస్లింలు పవిత్రంగా భావించే గ్యారవీ షరీఫ్ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని మస్తాన్ వీధిలో ఉన్న గౌస్‌మస్తాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 24 నుంచి కొణిసివీధి, ఆబాద్‌వీధి, కుముందన్ వీధి, డకినివీధి, కాటవీధి, పల్లివీధి, శాంతి నగర్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్యారవీ కమిటీ నిర్వహకులు రహీమ్, రసూల్, భాషా, తదితరులు మంగళవారం తెలిపారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 20న జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ జానీ, చిష్టీ, అహ్మద్, సలీమ్ పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు మరో అవకాశం

విజయనగరం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశానికి ఐదో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ టీవీ గిరి మంగళవారం విడుదల చేశారు. 28న ప్రభుత్వ, 30న ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు 5వ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 నిమిషాల్లోపు 'ఐటిఐ.ఏపీ.జివోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 26న యూనిక్ నంబర్‌తో దరఖాస్తు చేసిన ఐటీఐలలో ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

వరుస తుఫాన్లతో సాగని వేట

- ప్రతికూల వాతావరణంతో ఆందోళనలో మత్స్యకారులు
- అలల ఉధృతికి సాగని చేపల వేట
- 5 వేల మంది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి కరువు



తిప్పలవలసలో వేటసాగక ఒడ్డున నిలిపిన పడవలు

పూసపాటిరేగ : జిల్లాలో తీరప్రాంత మత్స్యకారుల జీవన ప్రమాణాలను ప్రతికూల వాతావరణం దెబ్బతీస్తోంది. కూటమి ప్రభుత్వం వేట నిషేధం కాలానికి పరిహారం ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో వాయిగుండం, తుఫాన్ల హెచ్చరికలతో మత్స్యకారుల జీవనోపాధిపై దెబ్బపడుతోంది. తుఫాన్లలో కెరటాలు ఉగ్రరూపం దాల్చుతుండటంతో సముద్రంలో వేటకు విరామం ఇచ్చి మత్స్యకారులు ఇళ్లకే పరిమితమౌతున్నారు. వేట సాగని ఫలితంగా జీవనాధారం కోల్పోతున్నారు. బంగాళాఖాతంలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణులు ప్రభావంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సముద్రంలో చేపలవేటకు ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత మూడు నెలలుగా వరుస తుఫాన్లతో తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులు అందరూ అలలు ఉధృతికి వేటను నిలిపివేసి ఇంటికే పరిమితిమవుతున్నారు. జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాలలో 19 మత్స్యకార గ్రామాలలో 21 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వారిలో సుమారు 5 వేల మంది వేట చేస్తుండగా వారిపై పరోక్షంగా మరో 16 వేల మంది ఆదారపడి జీవిస్తున్నారు. పూసపాటిరేగ మండలంలో చింతపల్లి, నీలగెడ్డపేట, చింతపల్లిబర్రిపేట, చింతపల్లిపెద్దూరు, కొత్తూరు, పతివాడబర్రిపేట, తిప్పలవలస, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, కోనాడ, బొడ్డుగురయ్యపేట, బొడ్డు వెంకటేషుపేట, భోగాపురం మండలంలో చేపలు కంచేరు, ముక్కాం, కొండ్రాజుపాలెం, చినకొండ్రాజుపాలెం, చోడిపల్లిపేట, ఎర్రముసలయ్యపాలెం తదితర మత్స్యకార గ్రామాలు వున్నాయి. పూసపాటిరేగ, భోగాపురం మండలాలలో 750 వరకు రిజిస్ట్రేషన్ బోట్లుపైనే మత్స్యకారులు వేటను సాగిస్తున్నారు. గత మూడు నెలలుగా వాతావరణంలో మార్పులు కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారడంతో చేపల వేటలేక ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో చేపలకు మంచి ధర పలుకుతున్నప్పటికీ సముద్రంలో వేటకు వెళ్లలేని పరిస్థితి తరుచూ ఎదురవుతోంది. వారం రోజుల్లో రెండుసార్లు తుఫాన్ హెచ్చరికలు రావడంతో సముద్రం ఉగ్రరూపం దాల్చిందని పలువురు మత్స్యకారులు వాపోయారు. కెరటాలు ఉధృతికి సముద్రాన్ని ఆనుకొని ఉన్న తిప్పలవలస, పతివాడబర్రిపేట, చింతపల్లి, చేపలుకంచేరు, ముక్కాం గ్రామాలలో మత్స్యకారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతుంటారు. వరుస తుఫాన్లతో ఇంటికే పరిమితిమవుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. రాబోయే తుఫాన్‌కు మత్స్యకారులకు ఎటువంటి విపత్తు రాకుండా అధికారులు అప్రమత్తం కావాలని సూచించారు.

చేపలు పడే సీజను ఇదే..

ఈ కాలంలో ఖరీదైన చేపలు పడటానికి ఇదే సమయం. సముద్రంలో ప్రతికూల పరిస్థితులు కారణంగా వేట సాగడం లేదు. అలలు ఎగిసి పడుతున్నాయి. సముద్రం కల్లోలంగా మారుతోంది. వారం రోజులుగా వేట సాగడం లేదు. మరలా తాజాగా తుఫాన్లు హెచ్చరికలు రావడంతో మత్స్యకారులకు ఇబ్బందిగా మారుతోంది.

– బర్రి చినఅప్పన్న, జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు, విజయనగరం

జీవనోపాధిపై ప్రభావం

నిత్యం చేపలు వేటపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు అల్పపీడన ద్రోణులు, తుఫాన్లు కారణంగా వేట నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు ఇస్తున్నారు. దీంతో వేట సాగక జీవన పరిస్థితులు ఇబ్బందికరంగా మారుతున్నాయి. వేటలేని సమయంలో ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకొని ప్రత్యమ్నాయం చూపించాలి.

– రాయితి బుచ్చోడు, మత్స్యకారుడు, తిప్పలవలస

నీరు నిల్వ లేకుండా చర్యలు



కాలువల్లో పూడికలు తీస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

విజయనగరం: నగరంలోని లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. మంగళవారం కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి లోతట్టు ప్రాంతాలలో ఉన్న కాలువలలో పూడికతీత పనులను పారిశుధ్య సిబ్బందితో మంగళవారం చేపట్టారు. వర్షాలు కురిసే సమయంలో లోతట్టు ప్రాంతాలలో వర్షపు నీరు అధికంగా చేరి చుట్టుపక్కల ప్రాంతాలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలతో వర్షపు నీరు ప్రవాహానికి అడ్డంకి లేకుండా చర్యలు చేపడుతున్నారు. పారిశుధ్య పరంగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలను సిబ్బందికి కమిషనర్ సూచిస్తున్నారు. కాలువలలో చెత్తా చెదారాలు వేయకుండా నిర్దేశిత డస్ట్ బిన్లలో మాత్రమే వ్యర్థాలను వేయాలని కమిషనర్ సూచించారు. రోడ్లపై విచ్చలవిడిగా చెత్తాచెదారాలను వేసినట్లయితే సదరు వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టించిన వారిని ఉపేక్షించబోమని చెప్పారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి

విజయనగరం రూరల్: తుఫాన్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బందితో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని వస్తున్న హెచ్చరికలు నేపథ్యంలో ఆయా సచివాలయం పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకుగానూ సిద్ధంగా ఉండాలన్నారు. అందుబాటులో ఎంపీడీఓ కార్యాలయంలో కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ అంతరాయం కలిగినా స్థానికులకు తాగునీరు అందించేందుకు ఎటువంటి ఇబ్బంది రానీయకుండా జనరేటర్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో ఆయనతో పాటు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవలో వాకర్స్ క్లబ్‌లు



దత్తసాయి వాకర్స్ క్లబ్ కార్యవర్గంతో అతిథులు

విజయనగరం: వాకర్స్ క్లబ్బులు సమాజానికి పట్టుగొమ్మలని ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ – 102 గవర్నర్ జామి నారాయణ స్వామి అన్నారు. మంగళవారం ఉదయం కొత్తపేట నీళ్లట్యాంక్ వద్దనున్న మహారాణి అప్పలకొండయాంబ రాక్ గార్డెన్‌లో దత్తసాయి వాకర్స్ నూతన క్లబ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ముందుగా అతిథులంతా మాజీ అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు తోష్నీవాల్ చిత్రపటానికి, దత్తసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన దత్తసాయి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలుగా సి.హెచ్.శేష శైలజ, ప్రధాన కార్యదర్శిగా జి.సంతోషి, కోశాధికారిగా డి.పైడిరాజు మిగిలిన కార్యవర్గ సభ్యులచే డిస్ట్రిక్ట్ – 102 గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గవర్నర్ నారాయణస్వామి మాట్లాడుతూ.. నడక సభ్యులంతా తమ ఆరోగ్యం కోసం నడవటమే కాకుండా సమాజం కోసం అవగాహనా కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, చలివేంద్రాలు, అన్నదానం, నేత్ర, రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజారోగ్యానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ కె.సత్యం, వాకర్స్ జిల్లా కోఆర్డినేటర్ జి.కృష్ణంరాజు, మాజీ గవర్నర్ డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాష్టారు, న్యాయవాది రాజు, డిప్యూటీ గవర్నర్ టి.చిరంజీవి రావు, బుంగ భానుమూర్తి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు



నెల్లిమర్ల రూరల్: సారిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నెల్లిమర్ల రూరల్: సేంద్రియ వ్యవసాయాన్ని రైతులు అలవర్చుకోవాలని జిల్లా వనరుల వ్యవసాయాధికారి సంగీత, ఏఓ పూర్ణిమ సూచించారు. మండలంలోని సారిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలించి వివిధ రకాల తెగుళ్లు సోకినట్లు గుర్తించారు. తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేల సారవంతంగా ఉండాలంటే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి పలకాలన్నారు. ప్రకృతి వనరులను సేంద్రియ ఎరువులుగా మార్చుకొని వ్యవసాయాన్ని చేస్తే మంచి దిగుబడితో పాటు ఖర్చులు కూడా భారీగా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరికి తెగుళ్ల బెడద



జొన్నాడలో తెగులు ఆశించిన వరి దుబ్బును పరిశీలిస్తున్న ఏడీఏలు, ఇతర అధికారులు

డెంకాడ: వరి పంటకు పలు రకాల తెగుళ్లు, పురుగులు ఆశిస్తున్నాయని, అందువలన రైతులు పంట సంరక్షణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఒమ్మి హరికృష్ణ, కె.భారతి అన్నారు. మండలంలోని జొన్నాడ, బొడ్డవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులతో కలిసి వ్యవసాయాధికారులు వరి పంటను పరిశీలించారు. వరి పంటకు ఆకుముడత, దోమపోటు, పాముపొడ, అగ్గి తెగులు ఆశించినట్టు గుర్తించారు. వీటి నివారణ చర్యలను రైతులకు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశయ రమణకు మెరుగైన వైద్యం అందించాలి



ఐసీయూలో చికిత్స పొందుతున్న రమణను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలై విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్న ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణను, ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మంగళ వారం పరామర్శించారు. రమణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆయన మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన శస్త్ర చికిత్సలు చేయించాలని, ఎలాంటి అవసరమైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ రమణ వైద్యం కోసం పూర్తి సహాయ, సహకారాలు అంది స్తామని, కోలుకుంటారని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని భరోసా కల్పించారు. రమణకు రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సహాయం అందించాలని సూచించారు.

తుఫాన్ నేపథ్యంలో తస్మాత్..



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి జోసఫ్

పూసపాటిరేగ : తుఫాన్ వచ్చే అవకాశం వున్నందున అధికారులు అప్రమత్తంగా వుండాలని మండల ప్రత్యేక అధికారి జోసఫ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో తీర ప్రాంతం వున్నందున అధికారులు అప్రమత్తతతో వుండాలన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు అప్రమత్తంగా వుండాలని సూచించారు. గ్రామాలలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ట్యాంకులను క్లోరినేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ తాడ్డి గోవింద మాట్లాడుతూ గ్రామాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాతకాలలో చాలా వరకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలలో బాధితలకు భోజన సదుపాయం ఏర్పాటుకు సామగ్రి సిద్ధ చేసినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమవ్వాలని ఆ శాఖ ఏఈ దేముడుకు సూచించారు. ఎంపీడీఓ ఎం.రాధిక, మండల ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కొల్లి నీలిమ, వైద్యాధికారులు బాగ్యరేఖ, సుదా, ప్రమీలాదేవి, ఐసీడీఎస్ పీఓ ఎస్తేరురాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే గంజాయి నిర్మూలన



సారిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

నెల్లిమర్ల రూరల్: గంజాయి నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ఎస్‌ఐ బి.గణేష్ కోరారు. మండలంలోని సారిపల్లి గ్రామంలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఎస్పీ వకుల్ జిందల్ ప్రత్యేక దృష్టి పెట్టారని, పట్టుబడితే ఎంతటివారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజల సహకారంతోనే నిర్మూలన సాధ్యమని, గంజాయి ఆనవాళ్లు కనిపిస్తే తక్షణమే తమకి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యం ఉంచుతామని చెప్పారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు జీవితాన్ని పాడు చేసుకుంటున్నారన్నారు. మన ఇంటి వరకు రాక ముందే ప్రజలు మేల్కోవాలని సూచించారు. మత్తుకు అలవాటు పడుతున్న యువత నేరాలకు పాల్పడి ఇతరుల జీవితాలను కూడా చిత్తు చేస్తున్నారన్నారు. గంజాయి కేసులో చట్టాలు కఠినంగా ఉన్నాయని, యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన వాల్‌పోస్టర్లను గ్రామంలో అతికించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లి తెప్పోత్సవం



అలయ ప్రాంతంలో మొక్కు చెల్లింపు

భక్తుల ఇలవేల్పు, పైడితల్లి అమ్మవారి తెప్పోత్సవం మంగళవారం కనులవిందుగా సాగింది. ఉదయం నుంచి చదురుగుడి, వనంగుడిలో పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలు సమర్పించారు. పసుపుకుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. సాయంత్రం పెద్దచెరువులో సాగిన తెప్పోత్సవాన్ని తిలకించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారి నామాన్ని స్మరించారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



సంప్రదాయ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న ఆలయ సిబ్బంది, పండితులు



తలనీలాలను సమర్పించుకుంటున్న చిన్నారి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



వేదపండితుల వేదస్వస్తిలో ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు, ఎ.గోపాలరావు, పెన్మేటి స్వప్న హైందవి, వేదపండితులు